సాక్షి
మెదక్
శనివారం, 19, జూలై, 2025



బెస్ట్ అవైలబుల్‌కు నిధుల గండం

నిరుపేద విద్యార్థులకు కార్పొరేట్ విద్య అందించేందుకు ప్రభుత్వం బెస్ట్ అవైలబుల్ పథకాన్ని ప్రారంభించింది. వివరాలు 8లో ▸



సాగులో మహిళల పాత్ర కీలకం

వ్యవసాయంలో మహిళల పాత్ర అధికమని వ్యవసాయ శాస్త్రవేత్త బాలకృష్ణ తెలిపారు. వివరాలు 8లో ▸



అధిక సాంద్రత.. అనేక లాభాలు

వానాకాలం పంటల సాగులో రైతులు ఆరుతడి వాణిజ్య పంటగా పత్తిపంటను సాగు చేస్తున్నారు. వివరాలు 9లో ▸

న్యూస్‌రీల్

సబ్‌జైలు తనిఖీ



మాట్లాడుతున్న న్యాయమూర్తి

మెదక్‌జోన్: సీనియర్ సివిల్ జడ్జి రుబీనా ఫాతిమా శుక్రవారం సబ్‌జైలును తనిఖీ చేశారు. ఖైదీల ఆరోగ్యంపై గురించి అడిగి తెలుసుకున్నారు. న్యాయ సలహాలు, సూచనలు చేశారు. ఖైదీల్లో మార్పు తీసుకువచ్చే విధంగా కృషి చేయాలని అధికారులకు సూచించారు. ఆమె వెంట అసిస్టెంట్ లీగల్ ఏడ్ డిఫెన్స్ కౌన్సిల్ నాగరాజు, సబ్ జైలు ఇన్‌చార్జి, సూపరింటెండెంట్ తదితరులు ఉన్నారు.

వన దుర్గమ్మకు బోనాలు



బోనాలతో జాయింట్ కలెక్టర్ నగేశ్ కుటుంబీకులు

పాపన్నపేట(మెదక్): ఆషాఢ మాసాన్ని పురస్కరించుకొని శుక్రవారం అదనపు కలెక్టర్ నగేశ్ కుటుంబ సభ్యులతో కలిసి వన దుర్గమ్మకు బోనాలు తీశారు. అర్చకులు ఆలయ మర్యాదల ప్రకారం స్వాగతం పలికారు. అనంతరం అమ్మవారిని దర్శించుకొని ఒడి బియ్యం పోసి, బోనాలు తీసి మొక్కులు చెల్లించుకున్నారు. ఈఓ చంద్రశేఖర్ జాయింట్ కలెక్టర్ దంపతులను సత్కరించారు. కార్యక్రమంలో ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ వహించాలి



ఉపాధ్యాయులతో మాట్లాడుతున్న డీఈఓ రాధాకిషన్

శివ్వంపేట(నర్సాపూర్): చదువులో వెనుకబడిన విద్యార్థులు పట్ల ఉపాధ్యాయులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాల్సిన అవసరం ఉందని జిల్లా విద్యాధికారి రాధాకిషన్ అన్నారు. శుక్రవారం శివ్వంపేట ప్రాథమిక పాఠశాలను తనిఖీ చేశారు. రికార్డులు, పరిసరాలను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. ఉపాధ్యాయులు అంకితభావంతో పనిచేస్తూ విద్యార్థుల అభ్యున్నతికి కృషి చేయాలని సూచించారు. ప్రతి విద్యార్థికి ప్రాథమిక విద్య ఎంతో ప్రాముఖ్యత ఉన్నందున అందుకనుగుణంగా బోధన చేయాల్సిన అవసరం ఉందన్నారు. కార్యక్రమంలో ఎంఈఓ బుచ్చనాయక్, కాంప్లెక్స్ హెచ్‌ఎం బాలచంద్రం, ఉపాధ్యాయులు లక్ష్మణ్‌రావు, స్వప్నకుమారి, రాజేంద్రప్రసాద్ ఉన్నారు.

ప్రత్యామ్నాయ పంటలు సాగు చేయాలి



రైతులకు విత్తనాలు అందజేస్తున్న డీఏఓ దేవ్‌కుమార్

నర్సాపూర్: రైతులు వరికి బదులుగా ప్రత్యామ్నాయ పంటలు సాగు చేయాలని జిల్లా వ్యవసాయాధికారి దేవ్‌కుమార్ సూచించారు. శుక్రవారం ఏడీఏ కార్యాలయాన్ని తనిఖీ చేసి అధికారులతో సమీక్ష నిర్వహించారు. అనంతరం విత్తనాల కోసం వచ్చిన రైతులకు పలు సూచనలు చేశారు. ప్రభుత్వం పంట మార్పిడి దిశగా ప్రోత్సహిస్తుందని చెప్పారు. అందులో భాగంగా పలు రకాల పప్పు దినుసుల విత్తనాలు అందచేస్తుందని వివరించారు. జాతీయ ఆహార, పోషక భద్రత పథకం కింద మినుములు, జొన్న విత్తనాల కిట్లు రైతులకు అందజేశారు. ఆయన వెంట మండల వ్యవసాయాధికారి దీపిక, ఏఈఓలు మోహన్, తేజస్విని, లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

సింగూరు నీటిని విడుదల చేయండి

- మంత్రి ఉత్తమ్‌కు శశిధర్‌రెడ్డి వినతి

పాపన్నపేట(మెదక్): సింగూరు నుంచి ఘనపురం ప్రాజెక్టుకు మొదటి విడతగా 0.005 టీఎంసీల నీటిని విడుదల చేయాలని మెదక్ మాజీ ఎమ్మెల్యే శశిధర్‌రెడ్డి ఇరిగేషన్ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డికి విజ్ఞప్తి చేశారు. వర్షాకాలం ప్రారంభమై రెండు నెలలు గడిచినా జిల్లాలో ఆశించిన వర్షాలు పడలేదన్నారు. దీంతో బోర్లు ఎండిపోతున్నాయని చెప్పారు. సింగూరు నుంచి న్యాయంగా ఘనపురం ప్రాజెక్టుకు 4 టీఎంసీల నీరు రావాల్సి ఉందని వివరించారు.



రామాయంపేట- మెదక్ దారిలో...

ప్రయాణం.. ఆహ్లాదం

చల్లదనంతో పాటు పచ్చదనం పరుచుకున్న ఈ రోడ్లపై ప్రయాణం ఆహ్లాదంగా ఉంటుంది. రహదారికి ఇరువైపులా ఉన్న చెట్లు వేసవిలో మోడుబారి, వర్షాలకు పచ్చగా పెరిగి వాహనదారులకు ఆనందాన్ని కలిగిస్తున్నాయి. మెదక్ వెళ్లే దారి, దౌల్తాబాద్ మార్గంలో, కోనాపూర్ తండా దారిలో రోడ్డుకిరువైపులా ఏపుగా పెరిగిన చెట్లు పచ్చందాలతో అలరారుతున్నాయి.

– రామాయంపేట(మెదక్)



రామాయంపేట- దౌల్తాబాద్ రూట్‌లో..

కల్లు కాదు.. కాలకూటం

‘పాపన్నపేట మండలం చీకోడ్ గ్రామానికి చెందిన వృద్ధుడు లక్ష్మీనగర్‌లో నివాసం ఉంటున్నాడు. అతనికి కల్లు తాగే అలవాటు ఉంది. ఇటీవల అనారోగ్యానికి గురి కాగా ఆస్పత్రికి వెళ్లాడు. పరీక్షించిన వైద్యులు కల్లు తాగొద్దని సూచించారు. అయితే కల్లు తాగకపోవడంతో తీవ్ర మానసిక ఆందోళనకు లోనయ్యాడు. ఆ వ్యథ భరించలేక రెండు వారాల క్రితం ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు.’



మత్తులో చిత్తవుతున్న బతుకులు

- పీల్చి పిప్పి చేస్తున్న అల్ప్రాజోలం
- జిల్లాలో 163 టీసీఎస్‌లు.. 303 టీఎఫ్‌టీలు
- అనధికారిక దుకాణాలు అనేకం

సాక్షి పరిశీలన

పాపన్నపేట(మెదక్): కల్తీ కల్లు అమాయకుల పాలిట కాలకూట విషంగా మారు తోంది. రసాయనాలతో తయారు చేసే కృత్రిమ కల్లు మనిషిని పీల్చి పిప్పి చేస్తుంది. అల్ప్రాజోలం లాంటి ప్రమాదకరమైన మత్తు పదార్థంతో తయారైన కల్లు తాగిన వ్యక్తులు వ్యసన పరులుగా మారుతున్నారు. ఈ క్రమంలో అనారోగ్యానికి గురై ప్రాణాలు పోగొట్టుకుంటున్నారు. మామూళ్ల మత్తులో జోగుతున్న ఎక్సైజ్ అధికారులకు చీమ కుట్టినట్లు లేదన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఏదైనా సంఘటన జరిగితేనే కేసులు నమో దు చేసి చేతులు దులుపుకుంటున్నారు. జిల్లాలో 163 టీసీఎస్‌లు, 303 టీఎఫ్‌టీలు ఉండగా, అనధికారిక దుకాణాలు లెక్కకు మించి ఉన్నాయి. పల్లె పల్లెన, గల్లీ గల్లీలో కల్లు దుకాణాలు దర్శనమిస్తున్నాయి. కొన్ని గ్రామాల్లో ఆటోలో కల్లు పెట్టెలు పెట్టుకొని కొన్ని గ్రామాల్లో ఆటోలో కల్లు పెట్టెలు పెట్టుకొని ‘కల్లుచ్చిందమ్మా.. కల్లు అంటు’ వీధి వీధి తిరుగుతూ కల్తీ కల్లు విక్రయిస్తున్నారు. అయినా సంబంధిత అధికారులు అటు వైపు తొంగి చూసిన పాపాన పోవడం లేదు.

తయారీ ఇలా..



జిల్లాలో ఈత, తాటి వనాలు ఉ న్నా, దుకాణదారులు కల్తీ కల్లునే విక్రయిస్తున్నారు. మత్తు కోసం ఎక్కువగా అల్ప్రాజోలం, క్లోరోహైడ్రేట్, డైజోఫాం వాడుతున్నారు. చిక్కదనం, తెలుపు రంగు కోసం వైట్ పేస్ట్, రుచి కోసం చక్రీన్, నురగ రావడానికి కఫ్ పౌడర్ లాంటివి వాడుతున్నారు. ఈ మధ్య తక్కువ ఖర్చుతో మత్తు రావడానికి యాంటీ సైకోటిక్ డ్రగ్ వాడుతున్నారన్న అనుమానాలు పలు చోట్ల వ్యక్తమవుతున్నాయి. విరివిగా వాడుతున్న అల్ప్రాజోలం కిలోకు రూ. 10 నుంచి రూ. 15 లక్షలకు విక్రయిస్తున్నట్లు తెలుస్తుంది. 10 గ్రాముల అల్ప్రాజోలంతో సుమారు 1,200 కల్లు సీసాలను తయారు చేస్తున్నారు. పాపన్నపేట మండల శివారులోని ఓ దుకాణంలో రూ. 10కి ఎర్ర సీసా, రూ. 15కు పచ్చ సీసా, రూ. 30కి ప్లాస్టిక్ బాటిళ్లు (ఫ్రీజ్‌లో పెట్టినవి) అమ్ముతున్నారు. ఇక్కడ మత్తు ఎక్కువగా ఉండటంతో యువకులు పెద్ద సంఖ్యలో తరలి వస్తున్నట్లు తెలుస్తుంది. మెదక్, చిన్నశంకరంపేట, జహీరాబాద్, సంగారెడ్డి, పటాన్‌చెరు కేంద్రంగా కొంత మంది దళారులు అల్ప్రాజోలం దందా చేస్తున్నారన్న ఆరోపణలున్నాయి. గతంలో మెదక్‌కు చెందిన కొంత మంది యువకులు పాశమైలారం ప్రాంతంతో లాక్ అవుట్ అయిన ఓ ఫ్యాక్టరీని లీజుకు తీసుకొని, అందులో అల్ప్రాజోలం తయారు చేశారనే ఆరోపణలున్నాయి. అలాగే మహారాష్ట్ర ఉమర్గ, ఖరాద్‌లోని పరిశ్రమల్లో సైతం ఇది తయారు చేస్తున్నట్లు సమాచారం. పూణె నుంచి కొంతమంది జహీరాబాద్, సంగారెడ్డి, ప్రాంతాలకు సరఫరా చేస్తున్నారని తెలుస్తుంది.

మామూళ్ల ‘మత్తు’లో ఎక్సైజ్‌శాఖ

అధికారుల అండతోనే కల్తీ కల్లు విక్రయాలు జోరుగా సాగుతున్నాయన్న ఆరోపణలున్నాయి. నెలకు సుమారు రూ. 20 నుంచి రూ. 25 వేల వరకు ఎక్సైజ్ అధికారులకు ముట్టజెప్పక తప్పదని కొంతమంది కల్లు దుకాణదారులు చెప్పడం గమనార్హం. స్టేషన్ స్థాయి అధికారులకు నెలకు రూ. 6 వేలు, సర్కిల్‌స్థాయి అధికారులకు రూ. 6 వేలు, జిల్లాస్థాయి వారికి ఆరు నెలలకు రూ.10 వేలు, స్పెషల్ పార్టీ టాస్క్‌ఫోర్స్ అధికారులకు 6 నెలలకు రూ. 25 వేల వరకు ఇవ్వడం ఆనవాయితీగా వస్తుందని తెలిపారు. తమకు వచ్చిన ఆదాయంలో సింహభాగం మామూళ్లకే కరిగి పోతుందని వాపోయారు.

ఆ దుకాణాలపై కేసులు పెట్టండి

> కల్తీ కల్లు విక్రయించే దుకాణాలపై కేసులు నమోదు చేయాలి. ఎక్సైజ్ అధికారులు అన్ని దుకాణాలపై దాడులు చేసి గీత కార్మికులను ఇబ్బంది పెట్టొద్దు. ప్రభుత్వం గీత కార్మికుల ఉపాధిని దృష్టిలో పెట్టుకోవాలి.
>
> – నరేందర్‌గౌడ్, పాపన్నపేట గౌడ సంఘం నాయకుడు

కల్తీ కల్లుకు కరిగిపోతున్న జీవితాలు

- తమిళనాడులోని మధురై జిల్లాకు చెందిన పాండు (43) పదేళ్లుగా పాపన్నపేటలో నివాసం ఉంటున్నాడు. కల్తీ కల్లుకు అలవాటుపడిన ఇతడు పండగ కోసం తమిళనాడు వెళ్లాడు. అక్కడ కల్లు దొరకక పిచ్చి, పిచ్చిగా ప్రవర్తించాడు. కుటుంబీకులు దయ్యం పట్టిందని అనుమానించి భూత వైద్యుడికి చూపెట్టారు. ఈలోగా పరిస్థితి విషమించి అక్కడే మరణించాడు.
- అనారోగ్యానికి గురై ఆస్పత్రికి వెళ్లిన పలువురు, కల్లు లేక పిచ్చిపిచ్చిగా ప్రవర్తిస్తూ చికిత్స సైతం తీసుకోకుండా వెనక్కివచ్చారు.

ఈ విషయమై అసిస్టెంట్ కమిషనర్ శ్రీనివాస్‌రెడ్డిని వివరణ కోరగా కల్తీ కల్లును అరికట్టడానికి పటిష్టమైన చర్యలు తీసుకుంటున్నట్లు చెప్పారు. ఎలాంటి ప్రలోభాలకు గురి కాకుండా ఇప్పటికే అనేక కేసులు నమోదు చేశామన్నారు. ఎక్కడ కల్తీ కల్లు విక్రయాలు జరిగినా తమ దృష్టికి తీసుకురావాలని సూచించారు.

42శాతం రిజర్వేషన్‌కు కట్టుబడి ఉన్నాం

బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్‌రావు



మాట్లాడుతున్న రాంచందర్‌రావు, చిత్రంలో ఎంపీ రఘునందన్, ఎమ్మెల్సీ అంజిరెడ్డి

మెదక్‌జోన్: బీసీలకు 42 శాతం రిజర్వేషన్‌పై బీజేపీ కట్టుబడి ఉందని, కేంద్రం ఒప్పుకోవడం బురద జల్లే ప్రయత్నం చేస్తున్నారని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్‌రావు అన్నారు. శుక్రవారం మెదక్‌లో ఏర్పాటు చేసిన కార్యకర్తల సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. చట్టబద్ధతలో భాగంగా ముస్లింలకు 10 శాతం రిజర్వేషన్ ఎలా కట్టబెడతారన్నారు. అలాంటప్పుడు అసలైన బీసీలకు అన్యాయం జరగదా అని ప్రశ్నించారు. బీసీల పట్ల కాంగ్రెస్‌కు చిత్తశుద్ధి ఉంటే సీఎం రేవంత్‌రెడ్డి రాజీనామా చేసి బీసీ నేతనే సీఎం చేయాలన్నారు. తెలంగాణలో పాలన పక్కన పెట్టిన సీఎం ఢిల్లీకి చక్కర్లు కొడుతున్నారని విమర్శించారు. కాంగ్రెస్ ఇచ్చిన ఆరు గ్యారంటీలు, 420 హామీలను తుంగలో తొక్కిందన్నారు. తెలంగాణకు కేంద్ర ప్రభుత్వం ఇప్పటివరకు రూ. 12 లక్షల కోట్లు ఇచ్చిందన్నారు. 2028లో రాష్ట్రంలో బీజేపీ అధికారంలోకి రావటం ఖాయమన్నారు. కాంగ్రెస్ దేశాన్ని దోచుకుందని, మోదీ సారథ్యంలో అవినీతి రహిత పాలన సాగుతుందన్నారు. అనంతరం ఎంపీ రఘునందన్‌రావు మాట్లాడుతూ.. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో పంచాయతీ మెంబర్ నుంచి జెడ్పీ చైర్మన్ వరకు బీజేపీ అభ్యర్థులే గెలవాలన్నారు. కాంగ్రెస్ వైఫల్యాలను ప్రజలకు వివరిస్తూనే కేంద్ర ప్రభుత్వం ఇస్తున్న పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలన్నారు. రైతులకు పూర్తిస్థాయిలో రుణమాఫీ చేయకుండా మోసం చేసిన కాంగ్రెస్‌ను ఎండగట్టాలని పిలుపునిచ్చారు. సింగూరు ఆయకట్టు కింద బీడు భూములకు సాగునీటిని అందించాలని డిమాండ్ చేశారు. పదేళ్ల బీఆర్‌ఎస్ హయాంలో మెదక్ అభివృద్ధికి నోచుకోలేదన్నారు. అనంతరం ఎమ్మెల్సీ అంజిరెడ్డి మాట్లాడుతూ.. కష్టపడే కార్యకర్తను బీజేపీ గుర్తిస్తుందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలను తుంగలో తొక్కిందని మండిపడ్డారు. సమావేశంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు మల్లేశ్‌గౌడ్, మాజీ జిల్లా అధ్యక్షుడు గడ్డం శ్రీనివాస్, నాయకులు ప్రసాద్, ఎంఎల్‌ఎస్‌రెడ్డి, సంగారెడ్డి జిల్లా అధ్యక్షురాలు గోదావరి, నందారెడ్డి, బక్కవారి శివ, రాజు, మల్లారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

బీజేపీ చీఫ్‌కు ఘన స్వాగతం



రాంచందర్‌రావును గజమాలతో సన్మానిస్తున్న నాయకులు

నర్సాపూర్: బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్‌రావుకు నాయకులు ఘన స్వాగతం పలికారు. శుక్రవారం ఆయన మెదక్ పర్యటనకు వెళ్తుండగా నర్సాపూర్ శివారులోని మల్లన్నగుడి వద్ద పార్టీ శ్రేణులు ఘన స్వాగతం పలికి గజమాలతో సత్కరించాయి. ఈసందర్భంగా రాంచందర్‌రావు పార్టీ జెండాను ఎగురవేశారు.

ప్రభుత్వ బడుల్లో నాణ్యమైన విద్య

కలెక్టర్ రాహుల్‌రాజ్



విద్యార్థులతో మాట్లాడుతున్న కలెక్టర్ రాహుల్‌రాజ్

చిన్నశంకరంపేట(మెదక్): ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థులు వందశాతం తరగతులకు హాజరయ్యేలా తల్లిదండ్రులు చూస్తే ఫలితాల్లో వందశాతం ఉత్తీర్ణత సాధించేలా మేం చూసుకుంటామని కలెక్టర్ రాహుల్‌రాజ్ అన్నారు. శుక్రవారం నార్సింగి మండల కేంద్రంలోని జెడ్పీ పాఠశాల, ప్రభుత్వ జూనియర్ కళాశాలను సందర్శించారు. ఈసందర్భంగా విద్యార్థులకు పాఠాలను బోధించి వారి ప్రతిభను పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వ బడుల్లో నాణ్యమైన, గుణాత్మక విద్యను అందిస్తున్నామన్నారు. అనంతరం నార్సింగి మండలంలోని వల్లూర్‌లో నిర్మాణంలో ఉన్న ఇందిరమ్మ ఇళ్లను పరిశీలించారు. నిర్మాణం పూర్తి అయిన వెంటనే బిల్లులు అందిస్తున్నామని తెలిపారు. గ్రామంలో కలియ తిరిగి ప్రైడే డ్రైడే కార్యక్రమంపై అవగాహన కల్పించారు. మురికి నీరు, నిల్వ నీరు దోమల పెరుగుదలకు కారణమన్నారు. కలెక్టర్ వెంట ఎంపీడీఓ ఆనంద్, పంచాయతీ కార్యదర్శి అంజిరెడ్డి ఉన్నారు.

స్థానిక ఎన్నికల్లో కాంగ్రెస్‌దే విజయం

నారాయణఖేడ్ ఎమ్మెల్యే సంజీవరెడ్డి



సీఎంఆర్‌ఎఫ్ చెక్కులను పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే

పెద్దశంకరంపేట(మెదక్): త్వరలో జరగబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్‌దే విజయమని, ఆదిశగా కార్యకర్తలు, నాయకులు సంఘటితంగా పనిచేయాలని నారాయణఖేడ్ ఎమ్మెల్యే డాక్టర్ సంజీవరెడ్డి అన్నారు. శుక్రవారం మండలానికి చెందిన పలువురికి సీఎంఆర్‌ఎఫ్ చెక్కులను పంపిణీ చేశారు. అలాగే మోడల్ స్కూల్‌ను సందర్శించి ప్రహరీ నిర్మాణానికి స్థలాన్ని పరిశీలించారు. కేజీబీవీ విద్యాలయంలో అదనపు గదులు, టాయిలెట్స్ నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు. మండలం లో విద్యాభివృద్ధికి తనవంతుగా కృషి చేస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి తహసీల్దార్ శ్రీనివాస్, ఎంపీడీఓ షాకీర్‌అలీ, నాయకులు మధు, నారాగౌడ్, ఆర్‌ఎన్. సంతోష్ పాల్గొన్నారు.

కేజీబీవీలో తీవ్ర నీటి ఎద్దడి

మూడు రోజులుగా స్నానం చేయని విద్యార్థినులు



విద్యార్థినులతో మాట్లాడుతున్న తహసీల్దార్ రజనికుమారి

రామాయంపేట(మెదక్): రామాయంపేట కేజీబీవీలో తీవ్ర నీటి ఎద్దడి నెలకొంది. భగీరథ నీరు సరఫరా కాకపోవడంతో మూడు రోజులుగా స్నానాలు చేయలేదని విద్యార్థినులు వాపోయారు. నీరు లేకపోవడంతో మూత్రశాలలు, మరుగుదొడ్లు దుర్వాసన వెదజల్లుతున్నాయి. ప్రస్తుతం ఒకే భవనంలో రామాయంపేట, నిజాంపేట కేజీబీవీ పాఠశాలలు కొనసాగుతున్నాయి. ఇందులో మొత్తం 330 మంది విద్యార్థులు చదువుకుంటున్నారు. నీటి ఎద్దడి విషయం తెలుసుకొని తహసీల్దార్ రజనికుమారి శుక్రవారం స్కూల్‌ను సందర్శించారు. నీటి ఎద్దడితో తాము ఇబ్బంది పడుతున్నామని, మూడు రోజులుగా స్నానాలు చేయలేదని విద్యార్థినులు ఆమె దృష్టికి తీసుకెళ్లారు. ఈసందర్భంగా తహసీల్దార్ టీచర్లతో మాట్లాడి విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లారు. విద్యార్థులు అధిక సంఖ్యలో ఉండటంతో భగీరథ నీరు సరిపోవడం లేదని, సమస్య పరిష్కారానికై కృషి చేస్తానని హామీ ఇచ్చారు.

మహేశ్‌కుమార్‌కు మతి భ్రమించింది

- బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షురాలు పద్మారెడ్డి



మెదక్ మున్సిపాలిటీ: టీపీసీసీ చీఫ్ మహేశ్‌కుమార్‌గౌడ్ మతి భ్రమించి మాట్లాడుతున్నారని బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షురాలు పద్మారెడ్డి విమర్శించారు. శుక్రవారం ఆమె మాట్లాడుతూ.. కేసీఆర్, హరీశ్‌రావుపై ఆయన చేసిన వ్యాఖ్యల్లో ఎంతమాత్రం నిజాలు లేవన్నారు. కేసీఆర్ తెలంగాణ తేకపోతే పీసీసీ అధ్యక్ష పదవి ఎక్కడిదని ప్రశ్నించారు. రేవంత్ మెప్పు కోసం స్థాయిని దిగజార్చుకొని మాట్లాడొద్దని హితవు పలికారు. ప్రత్యక్ష ఎన్నికల్లో ఎన్నడూ గెలవని మహేశ్ కుమార్ ప్రజలకు సంబంధం లేని విషయాలు మాట్లాడుతున్నారని మండిపడ్డారు. మా నాయకులను తిట్టడంపై ఉన్న శ్రద్ధ, రైతులకు యూరియా అందించడంలో చూపించాలన్నారు. అసెంబ్లీ పెట్టండి చర్చకు సిద్ధం అని హరీశ్‌రావు రోజూ చెబుతున్నా కాంగ్రెస్ నాయకులకు అర్థం కావడం లేదన్నారు. ప్రభుత్వానికి చిత్తశుద్ధి ఉంటే సింగూరు నుంచి సాగునీటిని విడుదల చేసి రైతులను ఆదుకోవాలని డిమాండ్ చేశారు.

కాంగ్రెస్ ప్రభుత్వంలో సాగునీటి ఇబ్బందులు

సిద్దిపేటరూరల్: కాంగ్రెస్ ప్రభుత్వంలో సాగునీటి ఇబ్బందులు తప్పడంలేదని మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీశ్‌రావు అన్నారు. శుక్రవారం మండల పరిధిలోని పుల్లూరులో దుర్గామాత ప్రథమ వార్షికోత్సవంలో హరీశ్‌రావు పాల్గొని పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మట్లాడుతూ అమ్మవారి ఆశీస్సులతో వర్షాలు సమృద్ధిగా కురవాలన్నారు. సకాలంలో కాళేశ్వరం గేట్లు ఎత్తి నీటిని విడుదల చేయకపోవడంతో రైతులకు ఇబ్బందులు ఏర్పడుతున్నాయని అన్నారు. రంగనాయక సాగర్ ప్రాజెక్టులో నీళ్లు ఉంటే నేడు పంటలకు బాగుండేదన్నారు.

నిలిచిన పనులపై దృష్టి సారించండి

మాజీ జెడ్పీ చైర్‌పర్సన్ హేమలత



సమావేశంలో మాట్లాడుతున్న హేమలత

మనోహరాబాద్(తూప్రాన్): కాంగ్రెస్ నాయకులు ప్రతిపక్షాలపై విమర్శలు మాని, గ్రామాల్లో నిలిచిపోయిన పనులపై దృష్టి సారించాలని మాజీ జెడ్పీ చైర్‌పర్సన్ ర్యాకల హేమలత హితవు పలికారు. శుక్రవారం మండలకేంద్రంలో విలేకరులతో మాట్లాడుతూ.. మెదక్ పర్యటించిన పీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్‌గౌడ్, మంత్రి వివేక్ కేసీఆర్‌పై విమర్శలు చేశారన్నారు. కేసీఆర్ గ్రామాలు, జిల్లాల అభివృద్ధికి కృషి చేశారని అన్నారు. ప్రతి మండలంలో ఆగిపోయిన సమీకృత భవనాలకు నిధులు మంజూరు చేసి పూర్తి చేయాలన్నారు. గ్రామాల్లో తాగునీటి వసతి కల్పించాలని, గ్రామ అవసరాలకు నిధులు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. ప్రతిపక్షాలపై విమర్శలు చేస్తూ కాలయాపన చేయడం సరికాదన్నారు. సమావేశంలో నాయకులు శేఖర్‌గౌడ్, భిక్షపతి, వెంకటేష్‌గౌడ్, రతన్‌లాల్, షఫీయోద్దీన్, శ్రీనివాస్, ఇర్ఫాన్‌ఖాన్, సాయికుమార్‌గౌడ్, నరేందర్‌గౌడ్, శైలేందర్ తదితరులు పాల్గొన్నారు.

పచ్చదనం పక్కాగా చేపడదాం

- హుస్నాబాద్ మున్సిపాలిటీ ముందువరుసలో నిలవాలి
- మంత్రి పొన్నం ప్రభాకర్



ప్రభుత్వ ఆస్పత్రిలో వైద్య సేవలపై ఆరా తీస్తున్న మంత్రి పొన్నం

హుస్నాబాద్: పచ్చదనం, పరిశుభ్రతలో రాష్ట్రంలోనే హుస్నాబాద్ మున్సిపాలిటీ నంబర్ వన్‌గా నిలవాలని మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. శుక్రవారం పట్టణంలో ప్రజలతో కలిసి మార్నింగ్ వాక్ నిర్వహించారు. ప్రజా సమస్యలు అడిగి తెలుసుకున్నారు. పట్టణంలోని ఆరపల్లె చౌరస్తాలో త్రిశూలం వాటర్ ఫౌంటేన్‌ను ప్రారంభించారు. మున్సిపల్ కార్యాలయంలో కార్మికులకు దుస్తులు పంపిణీ చేశారు. అనంతరం ప్రభుత్వ ఆస్పత్రిని ఆకస్మిక తనిఖీ చేసి రోగులకు అందుతున్న వైద్య సేవల గురించి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ స్వచ్ఛ సర్వేక్షన్‌లో హుస్నాబాద్ మున్సిపాలిటీ రాష్ట్ర స్థాయిలో 9వ ర్యాంక్, జిల్లాలో మొదటి ర్యాంక్ సాధించడంపై అధికారులను అభినందించారు. రాబోయే కాలంలో ప్లాస్టిక్ రహిత నియోజకవర్గంగా తీర్చిదిద్దుతానన్నారు. పట్టణంలో పెద్ద ఎత్తున సీసీ రోడ్లు, నాలాల నిర్మాణాలు పూర్తి అవుతున్నాయన్నారు.

క్లుప్తంగా

హౌస్ వైరింగ్‌లో ఉచిత శిక్షణ

సంగారెడ్డి టౌన్: స్టేట్ బ్యాంక్ ఆఫ్ గ్రామీణ స్వయం ఉపాధి శిక్షణ కేంద్రంలో హౌస్ వైరింగ్‌లో ఉచిత శిక్షణకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు డైరెక్టర్ సూర్య ప్రకాష్ శుక్రవారం తెలిపారు. సంగారెడ్డి, మెదక్ జిల్లాలకు చెందిన 18 నుంచి 45 సంవత్సరాలలోపు ఉన్న పురుషులు అర్హులని పేర్కొన్నారు. వివరాలకు 94901 03390 నంబర్‌లో సంప్రదించాలని కోరారు.

లైంగికదాడికి యత్నం కేసులో ఐదేళ్ల జైలు

జిన్నారం (పటాన్‌చెరు): మైనర్‌పై లైంగికదాడికి యత్నించిన కేసులో ఓ వ్యక్తికి న్యాయమూర్తి జైలు శిక్ష, జరిమానా విధించిందని గుమ్మడిదల ఎస్‌ఐ భరత్‌భూషణ్ ఓ ప్రకటనలో తెలిపారు. 2018లో ఏడేళ్ల బాలిక రోజూ మాదిరిగా సాయంత్రం ట్యూషన్‌కు వెళ్లింది. ట్యూషన్ గది కింద నివాసముండే మెదక్ జిల్లా, చిలిపిచెడ్ మండలం, రాందాస్‌గూడకు చెందిన ఆకుల వీరేశం (37) బాలికను గదిలోకి తీసుకెళ్లి లైంగికదాడికి యత్నించాడన్న ఫిర్యాదుకు అప్పటి ఎస్‌ఐ కేసు నమోదు చేసి కోర్టులో చార్జిషీట్ దాఖలు చేశారు. పూర్వాపరాలు విన్న ప్రత్యేక న్యాయమూర్తి జయంతి నిందితుడికి ఐదేళ్ల జైలు శిక్ష, రూ.5వేల జరిమానా విధిస్తూ తీర్పు నిచ్చారు. నిందితుడికి శిక్షపడేలా కృషిచేసిన న్యాయవాది సూర్‌రెడ్డి, ఇన్వెస్టిగేషన్ అధికారి ఎస్‌ఐ రాజేష్ నాయక్, ప్రస్తుత ఎస్‌ఐ భరత్ భూషణ్, హెడ్ కానిస్టేబుల్ సురేష్ కుమార్, శంకర్, సత్యనారాయణలను ఎస్పీ పరితోష్ పంకజ్ అభినందించారు.

ద్విచక్ర వాహనం చోరీ

కంగ్టి(నారాయణఖేడ్): ద్విచక్ర వాహనం చోరీకి గురైంది. మండల కేంద్రానికి చెందిన కోయలకొండ సంజీవ్‌కుమార్ గురువారం రాత్రి ఇంటి ముందు టీఎస్ 15 ఎఫ్‌సీ 0424 నంబర్ గల ద్విచక్ర వాహనాన్ని పార్కు చేశారు. కాగా వాహనానికి హ్యాండిల్ లాక్ వేయలేదు. దీంతో గుర్తు తెలియని యువకుడు రాత్రి 10. 47 నిమిషాలకు వాహనం తీసుకొని వెళ్లినట్లు సీసీ ఫుటేజీలో చూసి నిర్ధారించారు. బాధితుడు పోలీసులకు ఫిర్యాదు చేశారు.

ఉరేసుకుని వివాహిత ఆత్మహత్య

మనోహరాబాద్(తూప్రాన్): ఉరి వేసుకుని వివాహిత ఆత్మహత్య చేసుకుంది. ఈ ఘటన మనోహరాబాద్ పోలీస్‌స్టేషన్ పరిధిలో శుక్రవారం చోటు చేసుకుంది. స్థానికుల వివరాల ప్రకారం...



విశాలి

గ్రామానికి చెందిన చెందిన నవీన్‌గౌడ్ భార్య విశాలి (28) ఎప్పటిలాగే పరిశ్రమలో పనికి వెళ్లి ఇంటికి వచ్చి ఇంట్లో ఉరివేసుకుంది. మృతురాలికి 8, 4 సంవత్సరాల ఇద్దరు కుమారులున్నారు. పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది. కాగా ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం తూప్రాన్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

అక్రమ ఇసుక తరలిస్తున్న ట్రాలీ పట్టివేత



బెజ్జంకి(సిద్దిపేట): అక్రమంగా ఇసుకను తరలిస్తున్న ట్రాలీ వాహనాన్ని పోలీసులు పట్టుకున్నారు. మండలంలోని గుగ్గిల్ల క్రాస్ రోడ్డు వద్ద శుక్రవారం ఎస్‌ఐ సౌజన్య అదుపులోకి తీసు కున్నారు. అనంతరం తోటపల్లిలోని ఒక నివా స గృహం వద్ద నిలువ చేసిన మూడు ట్రిప్పుల ఇసుకను సీజ్ చేశారు. ఇందిరమ్మ ఇల్లు పేరుతో అక్రమంగా ఇసుక తరలిస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. పర్మిట్లతోనే ఇసుకను లబ్ధిదారులకు మాత్రమే అందించాలని స్పష్టం చేశారు.

హత్యాయత్నం కేసులో నిందితుల అరెస్టు

కొమురవెల్లి(సిద్దిపేట): కొమురవెల్లి పోలీస్‌స్టేషన్ ఆవరణలో వ్యక్తిని కారుతో ఢీకొట్టి హత్యాయత్నానికి పాల్పడిన ఘటన విదితమే. కేసుకు సంబంధించిన వివరాలను ఎస్‌ఐ రాజు శుక్రవారం వెల్లడించారు. మండలంలోని అయినాపూర్ గ్రామానికి చెందిన అలేటి రాణి ఇచ్చిన ఫిర్యాదు మేరకు హత్యాయత్నం కేసు నమోదు చేసి విచారణ చేపట్టారు. నిందితులు నాయిని ప్రతాప్‌రెడ్డి, నాయిని యాదిరెడ్డి, రామపురం మహేశ్వర్ రెడ్డి, నాయిని వెంకట్ రెడ్డిలను అరెస్టు చేసి రిమాండ్ తరలించారు. హత్యాయత్నానికి ఉపయోగించిన కారు, 5 సెల్‌ఫోన్‌లు ,కర్రలను స్వాధీనం చేసుకున్నట్లు పోలీసులు తెలిపారు.

బెస్ట్ అవైలబుల్‌కు నిధుల గండం

- మూడేళ్లుగా రూ.1.70కోట్లు పెండింగ్
- జిల్లాలో 454 మంది విద్యార్థులు
- ఫీజులు చెల్లించాలని ప్రైవేట్ యాజమాన్యాలు ఒత్తిడి
- ఆందోళనలో విద్యార్థుల తల్లిదండ్రులు



కలెక్టరేట్‌లో నిర్వహించిన లాటరీకి హాజరైన విద్యార్థులు, తల్లిదండ్రులు(ఫైల్)

మెదక్ కలెక్టరేట్: నిరుపేద ఎస్సీ విద్యార్థులకు కార్పొరేట్ స్థాయి నాణ్యమైన విద్య అందించేందుకు ప్రభుత్వం బెస్ట్ అవైలబుల్ పథకాన్ని ప్రారంభించింది. ఈ పథకం కింద జిల్లాలో ఈ ఏడాది 120 మందికి 117 మంది ఎంపికయ్యారు. వీరితో పాటు మరో 337 మంది పూర్వ విద్యార్థులు మొత్తం 454 మంది ప్రైవేట్ పాఠశాలల్లో విద్యనభ్యసిస్తున్నారు. అయితే ప్రభుత్వం నుంచి నిధులు రాకపోవడంతో, ఫీజులు చెల్లించాలని ప్రైవేట్ యాజమాన్యాలు ఒత్తిడి చేస్తున్నాయని విద్యార్థుల తల్లిదండ్రులు వాపోతున్నారు.

పథకం కింద 1నుంచి 4వ తరగతి వరకు డేస్కాలర్, 5 నుంచి విద్యార్థులకు హాస్టల్ వసతితో కూడిన విద్యను అందిస్తుంది. మూడేళ్లుగా ప్రభుత్వం పథకానికి సంబంధించ నిధులు విడుదల చేయడం లేదు. దీంతో ప్రైవేటు పాఠశాలల యజమానులు విద్యార్థుల తల్లితండ్రులను ఫీజులు చెల్లించాలని ఒత్తిడి చేస్తున్నారు. ఈ ఏడాది బెస్ట్ అవైలబుల్ పథకం కింద విద్యార్థులను చేర్చుకునేందుకు ప్రైవేట్ యాజమాన్యాలు ముందుకు రాలేదు. గతంలో పథకం కింద ఎంపికై విద్యనభ్యసిస్తున్న విద్యార్థులను ఫీజులు తీసుకురావాలని ఇంటికి పంపించారు. స్పందించిన కలెక్టర్ రాహుల్‌రాజ్ యజమాన్యాలకు సర్ది చెప్పడంతో విద్యార్థులను చేర్చుకున్నారు.

మూడేళ్లుగా నిధులు పెండింగ్

జిల్లాలోని ఎస్సీ విద్యార్థులకు పథకం కింద 1నుంచి 4వ తరగతి వరకు ప్రతి విద్యార్థికి రూ.28 వేలు, 5నుంచి 10వ తరగతి వరకు ప్రతి విద్యార్థికి రూ.42 వేల చొప్పున ప్రభుత్వం ప్రైవేట్ విద్యా సంస్థలకు చెల్లిస్తుంది. ఎస్సీ విద్యార్థులు చదువుతున్న పాఠశాలలకు చెల్లించాల్సిన డబ్బులు మూడేళ్లుగా మొత్తం రూ.1.70 కోట్లు పెండింగ్‌లో ఉన్నాయి. కాగా జిల్లాలో బెస్ట్ అవైలబుల్ పథకం కింద ఐదు ప్రైవేట్ పాఠశాలలు ఉన్నాయి. మెదక్‌లో సిద్ధార్థ్ మోడల్ హైస్కూల్, మంభోజిపల్లి గీతా హైస్కూల్, రామాయంపేటలో వివేకానంద హైస్కూల్, మంజీరా హైస్కూల్, తూప్రాన్‌లో గీతా హైస్కూల్‌లు ఉన్నాయి.

117 మంది ఎంపిక

జిల్లాలో ఈ ఏడాది పథకం కింద 120 సీట్లు ఉండగా 117 మంది ఎంపిక కాగా, గతంలో ఎంపికై చదువుతున్న విద్యార్థులు 337 మంది ఉన్నారు. మెదక్ సమీకృత కలెక్టరేట్‌లో షెడ్యూల్డు కులాల అభివృద్ధి శాఖ అధికారి విజయలక్ష్మి ఆధ్వర్యంలో, కలెక్టర్ రాహుల్‌రాజ్ సమక్షంలో జూన్ 25న ఒకసారి, ఈనెల 9న లాటరీ పద్ధతిలో విద్యార్థులను ఎంపిక చేశారు.

పుస్తకాలు ఇవ్వలేదు



పాఠ్యపుస్తకాలు, నోటు బుక్స్ కొనుగోలు చేస్తామన్న కూడా యాజమాన్యం ఇవ్వలేదు. మా పాప గత ఏడాది పథకం కింద ఎంపికై మెదక్‌లోని ఓ ప్రైవేట్ పాఠశాలలో చదువుతుంది. పెండింగ్ ఫీజులు ప్రభుత్వం చెల్లించడం లేదని పాఠశాల నిర్వాహకులు చెబుతున్నారు. ప్రభుత్వం వెంటనే బకాయి ఫీజులు చెల్లించాలి.

– కుమార్, మద్దుల్వాయి, విద్యార్థి తండ్రి

నిధులు మంజూరు చేయాలి



ప్రభుత్వం బెస్ట్ అవైలబుల్ పథకానికి సంబంధించి పెండింగ్‌లో ఉన్న ఫీజులు మంజూరు చేయాలి. ఫీజులు చెల్లించక పోవడంతో విద్యార్థులను ప్రైవేట్ యాజమాన్యాలు ఇబ్బందులకు గురిచేస్తున్నాయి. మరోవైపు స్కాలర్‌షిప్‌లు, ఫీజు రీయింబర్స్‌మెంట్ మంజూరు కాక పేద విద్యార్థులు చదువుకు దూరమయ్యే పరిస్థితి నెలకొంది.

– అజయ్‌కుమార్, ఎస్ఎఫ్ఐ, మెదక్ జిల్లా కార్యదర్శి

రాగానే అందజేస్తాం



ప్రభుత్వం నిధులు మంజూరు చేయాల్సి ఉంది. మూడేళ్ల నుంచి ఫీజులు పెండింగ్‌లో ఉన్నాయి. ఇటీవల కలెక్టర్ విద్యా సంస్థల యజమానులతో మాట్లాడారు. ప్రభుత్వం నుంచి నిధులు మంజూరు కాగానే అందజేస్తామని, అప్పటి వరకు విద్యార్థులకు ఇబ్బందులు కలిగించొద్దని సూచించారు.

– విజయలక్ష్మి, జిల్లా షెడ్యూల్డు కులాల అభివృద్ధి అధికారిణి, మెదక్

పాఠాలు చెబుతూ కుప్పకూలిన ఉపాధ్యాయుడు

ఆస్పత్రికి తరలిస్తుండగా మృతి



సోమాచారి

జగదేవ్‌పూర్(గజ్వేల్): విద్యార్థులకు పాఠాలు చెబుతూ ఉపాధ్యాయుడు గుండెపోటుకు గురయ్యాడు. ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలోనే ప్రాణాలు వదిలాడు. ఈ ఘటన మండలంలోని పీర్లపల్లిలో శుక్రవారం జరిగింది. వివరాలు ఇలా ఉన్నాయి. వట్టిపల్లి గ్రామానికి చెందిన కేతోజ్ సోమచారి(55) పీర్లపల్లి ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో సోషల్ ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్నాడు. రోజు లాగే శుక్రవారం పాఠశాలకు హాజరయ్యాడు. ఉదయం పదకొండు గంటల సమయంలో ఐదో తరగతి విద్యార్థులకు సోషల్ పాఠాలు చెబుతున్న క్రమంలో ఛాతీలో మంట రాగా వెంటనే ప్రధానోపాధ్యాయుడు జలేందర్‌రెడ్డికి విషయం చెప్పాడు. దీంతో బైక్‌పై జగదేవ్‌పూర్‌లోని ఓ ప్రైవేట్ క్లినిక్‌లో చూపెట్టగా సదరు వైద్యుడు వెంటనే ఆస్పత్రికి తరలించాలని సూచించాడు. ఉపాధ్యాయుడి అన్న, ఐఆర్‌పీ బాలు కలిసి కారులో హైదరాబాద్‌లోని ప్రైవేట్ ఆస్పత్రికి వస్తున్న క్రమంలో యాదాద్రి భువనగిరి జిల్లా మదాపూర్ సమీపంలోకి రాగానే మార్గమధ్యలో చనిపోయాడు. ఉపాధ్యాయుడికి ఇద్దరు కుమారులు సిద్ధార్థ్, నరేష్ ఉన్నారు. పెద్ద కుమారుడు ఇంజినీరింగ్ పూర్తి చేసి పై చదువుల కోసం యూఎస్‌కు వెళ్లేందుకు సిద్ధమయ్యాడు. నాన్న మృతదేహం వద్ద కుమారుడు కుర్చొని డాడీ యూఎస్‌కు ఎప్పుడు పంపుతావు అంటూ రోదించిన తీరు అందరిని కంటతడి పెట్టించింది. పలువురు ఉపాధ్యాయులు, సంఘాల నేతలు సంతాపం వ్యక్తం చేశారు.

తహసీల్దార్ కార్యాలయంలో ఏసీబీ సోదాలు

- పట్టాదార్ పాస్‌బుక్‌కు రూ.2లక్షలు డిమాండ్
- ములుగు డిప్యూటీ తహసీల్దార్‌పై కేసు నమోదు

ములుగు(గజ్వేల్): పట్టాదారు పాస్‌బుక్ కోసం డబ్బులు డిమాండ్ చేసిన డిప్యూటీ తహసీల్దార్‌పై ఏసీబీ అధికారులు కేసు నమోదు చేశారు. ఈ ఘటన శుక్రవారం సిద్దిపేట జిల్లా ములుగులో చోటు చేసుకుంది. ఉమ్మడి మెదక్ జిల్లా ఏసీబీ డీఎస్పీ సుదర్శన్ వివరాల ప్రకారం... మండలంలోని సిగన్నగూడ రైతుకు చెందిన 16 గుంటల భూమిని పట్టాదారు పాస్‌బుక్ నమోదు ప్రాసెస్ ప్రారంభించేందుకు డిప్యూటీ తహసీల్దార్ భవానీ రైతు వద్ద రూ.2లక్షలు డిమాండ్ చేసింది. దీంతో బాధితుడు ఏసీబీ అధికారులను ఆశ్రయించగా శుక్రవారం అధికారులు తహసీల్దార్ కార్యాలయంలో సోదాలు నిర్వహించి, డిప్యూటీ తహసీల్దార్ భవానీపై కేసు నమోదు చేసి విచారణ చేపట్టారు. అధికారులు లంచం డిమాండ్ చేస్తే 1064 టోల్ ఫ్రీ నంబర్‌లో సంప్రదించాలని సూచించారు.

సామాజిక అంశాలపై ఫోకస్ పెట్టండి

జర్నలిస్టుల శిక్షణ తరగతుల్లో ఎమ్మెల్యే హరీశ్ రావు



మాట్లాడుతున్న ఎమ్మెల్యే హరీశ్ రావు

సిద్దిపేటజోన్: ప్రస్తుతం సమాజం ఎదుర్కొంటున్న సామాజిక సమస్యలు, ప్రభుత్వాన్ని కదిలించే వార్తలపై జర్నలిస్టులు ఫోకస్ పెట్టాలని సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్ రావు సూచించారు. శుక్రవారం ఓ ఆడిటోరియంలో తెలంగాణ మీడియా అకాడమీ ఆధ్వర్యంలో శిక్షణ తరగతుల ప్రారంభ కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. శిక్షణ వల్ల జర్నలిస్టు విలువ, సిద్ధాంతం, గౌరవ ప్రతిష్ట పెరుగుదల, అంశాలపై అవగాహన కలుగుతుందన్నారు. సిద్దిపేట జర్నలిస్టులకు తన సొంత డబ్బులతో రూ.10లక్షల బీమా సౌకర్యం కల్పించనున్నట్టు ఆయన ప్రకటించారు.

చరిత్రాత్మక మార్పులు..

జర్నలిజంలో చారిత్రాత్మక మార్పులు వస్తున్నాయని తెలంగాణ మీడియా అకాడమీ చైర్మన్ శ్రీనివాస్ రెడ్డి అన్నారు. త్వరలో అకాడమీ ఆధ్వర్యంలో ఆర్టిఫిషియల్ ఇంటలిజెన్స్‌పై వర్క్‌షాప్ ఏర్పాటు చేస్తాన్నారు. అనంతరం ఎమ్మెల్సీ దేశపతి శ్రీనివాస్ మాట్లాడారు. వివిధ సెషన్లలో సమాచార హక్కు చట్టం గూర్చి మాజీ కమిషనర్ దిలీప్ రెడ్డి మాట్లాడుతూ.. అన్ని రంగాల్లో శిక్షణ అవసరమని పేర్కొన్నారు. జరిగిన వార్త కథనాలు, ప్రత్యేక కథనాలు అంశంపై ఎడిటర్(దిశ) మార్కండేయ, భాష, దిద్దుబాటు అంశంపై ఎడిటర్(విశాలాంధ్ర) రామారావు మాట్లాడారు. రాష్ట్ర వర్కింగ్ జర్నలిస్టుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు విరాహత్ అలీ ప్రసంగించారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు రంగాచారి, జర్నలిస్టులు పాల్గొన్నారు.

ఆన్‌లైన్ బెట్టింగ్‌లపై నిఘా పెంచాలి

వన్ టౌన్, మహిళా పీఎస్‌ను తనిఖీ చేసిన సీపీ



సిద్దిపేట వన్ టౌన్ పీఎస్ సిబ్బందితో సీపీ అనురాధ

సిద్దిపేటకమాన్: ఆన్‌లైన్ బెట్టింగ్, గేమ్స్ వంటి వాటిపై నిఘా పెంచాలని సీపీ అనురాధ పోలీసులకు సూచించారు. వార్షిక తనిఖీల్లో భాగంగా సిద్దిపేట వన్‌టౌన్ పీఎస్, మహిళ పోలీసు స్టేషన్‌లను సీపీ శుక్రవారం సందర్శించారు. పోలీసు స్టేషన్‌ల చుట్టూ పరిసర ప్రాంతాలు, సీజ్ చేసిన వాహనాలు, రిసెప్షన్, రికార్డ్, రైటర్ రూమ్‌లను పరిశీలించారు. ఈ సందర్భంగా సీపీ మాట్లాడుతూ... ప్రజల రక్షణే ధ్యేయంగా విధులు నిర్వహించి మన్ననలు పొందాలన్నారు. వివిధ కేసుల్లో ఉన్న వాహనాల అడ్రస్ తెలుసుకుని సంబంధిత యజమానులకు అప్పగించాలన్నారు. త్వరలో జరగనున్న స్థానిక సంస్థల ఎన్నికల సందర్భంగా ముందస్తు ప్రణాళికలు సిద్ధం చేసుకోవాలని సూచించారు. అక్రమ ఇసుక, పీడీఎస్ బియ్యం రవాణా జరగకుండా చూడాలన్నారు. మహిళ పీఎస్‌కు వచ్చే మహిళల పట్ల సానుభూతితో వ్యవహరించి సమస్యలు పరిష్కరించాలన్నారు. కార్యక్రమంలో సిద్దిపేట ఏసీపీ రవిందర్‌రెడ్డి, వన్ టౌన్ సీఐ వాసుదేవరావు, మహిళ పోలీసు స్టేషన్ సీఐ దుర్గ, ఎస్‌బి ఇన్‌స్పెక్టర్ శ్రీధర్‌గౌడ్, పోలీసు అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

కారు ఢీ.. మహిళ మృతి



రేణుక

నిజాంపేట(మెదక్): రోడ్డు ప్రమాదంలో మహిళ మృతి చెందింది. ఈ ఘటన మండల పరిధిలో చోటు చేసుకుంది. కుటుంబ సభ్యుల వివరాల ప్రకారం.. మండల కేంద్రానికి చెందిన గెరిగంటి రేణుక(45) మేడ్చల్–మల్కాజిగిరి జిల్లాలోని గండిమైసమ్మలో ఉంటున్న తన కూతురు ఇంటికి బోనాల పండుగకు వెళ్తోంది. ఈ క్రమంలో విజ్ఞాన జ్యోతి కళాశాల ఎదురుగా రోడ్డు దాటుతున్న క్రమంలో వేగంగా వచ్చిన కారు ఆమెను ఢీకొట్టింది. దీంతో అక్కడికక్కడే మృతి చెందింది.

విద్యార్థినులకు అస్వస్థత

హుస్నాబాద్: హుస్నాబాద్‌లోని గురుకుల బాలికల పాఠశాల (బెజ్జంకి) విద్యార్థినులు శుక్రవారం ఫుడ్ పాయిజన్‌తో అస్వస్థతకు గురయ్యారు. పాఠశాలలో అపరిశుభ్రత, తాగునీరు సరిగా లేక విద్యార్థినులు, వాంతులు, విరోచనాలు, దగ్గు, తలనొప్పితో అస్వస్థతకు గురి కావడంతో పాఠశాల ఉపాధ్యాయులు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. వైద్యులు పరీక్షించి మందులు ఇచ్చారు. ఫుడ్ పాయిజన్ కావడంతోనే 8 మంది విద్యార్థినులు అస్వస్థతకు గురైనట్లు ఆస్పత్రి వర్గాలు తెలిపాయి. పాఠశాలలపై అధికారుల పర్యవేక్షణ లేకపోవడం వల్లే జరిగిందని తెలుస్తోంది.

దుబాయ్ నుంచి స్వగ్రామానికి మృతదేహం

బెజ్జంకి(సిద్దిపేట): మండల కేంద్రానికి చెందిన ఉమ్మడి రామచంద్రన్‌చారి అనారోగ్యంతో ఈనెల 11న దుబాయ్‌లో మృతి చెందాడు. ఆయన మృతదేహం శుక్రవారం బెజ్జంకికి చేరుకుంది. గల్ఫ్ కార్మిక సంఘాల నాయకులు మృతదేహాన్ని స్వగ్రామానికి తెప్పించేందుకు చేసిన కృషికి గాను కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు. గల్ఫ్ మృతులకు ప్రభుత్వం అందించే రూ.5లక్షల సహాయాన్ని సత్వరం అందేలా చూడాలని స్థానిక ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణను సంక్షేమ సంఘం నాయకులు కోరినట్లు శంకర్‌గౌడ్, సంపత్, తిరుపతి తెలిపారు.

దుర్గమ్మను దర్శించుకున్న కమల దళపతి



రాంచందర్‌రావు, ఎంపీ రఘునందన్ రావు, ఎమ్మెల్సీ అంజిరెడ్డికి స్వాగతం పలుకుతున్న ఆలయ సిబ్బంది

పాపన్నపేట(మెదక్): ఏడుపాయల వన దుర్గమ్మను బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్.రాంచందర్ రావు శుక్రవారం దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. మెదక్ ఎంపీ రఘునందన్‌రావు, ఎమ్మెల్సీ అంజిరెడ్డితో కలిసి ఏడుపాయలకు వచ్చిన ఆయనకు అర్చకులు శంకర శర్మ, పార్థివ శర్మ, ఈఓ చంద్రశేఖర్ పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. ఆలయంలో పూజలు చేసి తీర్థ, ప్రసాదాలు స్వీకరించారు. అనంతరం ఈఓ వారిని సత్కరించారు. ఆయన వెంట జిల్లా బీజేపీ అధ్యక్షుడు వాల్దాస్ మల్లేష్ గౌడ్, జిల్లా , మండల నాయకులు, కార్యకర్తలు ఉన్నారు.

గంజాయి స్వాధీనం



పట్టుబడిన నిందితులతో పోలీసులు

మునిపల్లి(అందోల్): ఎండు గంజాయిని పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. బుదేరా ఎస్‌ఐ రాజేశ్ నాయక్ కథనం ప్రకారం... శుక్రవారం మండలంలోని కంకోల్ టోల్ ప్లాజా సమీపంలో వాహనాల తనిఖీ నిర్వహించారు. నాందేడ్ జిల్లాకు చెందిన అజింకే పండరి భారతి, సచీన్, వీరబోయిన శ్రీకాంత్ బీదర్ ఇరానీ గల్లీలో ఇర్ఫాన్ అనే వ్యక్తి దగ్గర 600 గ్రాముల ఎండు గంజాయి కొనుగోలు చేశారు. హైదరాబాద్‌కు స్కూటీపై తరలిస్తుండగా పట్టుకున్నారు. వారి నుంచి రూ.4 వేలు, స్కూటీని స్వాధీనం చేసుకున్నారు. గంజాయి తీసుకుని రమ్మని దత్త దేశ్‌ముఖ్ రూ.10 వేలు, జ్ఞానేశ్వర్ రూ.30 వేలతోపాటు తన స్కూటీ ఇచ్చాడని విచారణలో నిందితులు చెప్పారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. ఇంకా ముగ్గురు పరారీలో ఉన్నారని, త్వరలో వారిని పట్టుకుంటామని పోలీసులు తెలిపారు. ఏఎస్‌ఐ బక్కన్న, ఎండీ హనీఫ్, మహేశ్ కుమార్, డ్రైవర్ హమ్మద్ పాషాలను సీఐ సుమన్ కుమార్ అభినందించారు.

వేర్వేరు చోట్ల ముగ్గురు అదృశ్యం



వెంకటయ్య

జగదేవ్‌పూర్(గజ్వేల్): వృద్ధుడు అదృశ్యమయ్యాడు. ఈ ఘటన మండలంలోని దౌలాపూర్ గ్రామంలో చోటు చేసుకుంది. ఎస్‌ఐ కృష్ణారెడ్డి వివరాల ప్రకారం... గ్రామానికి చెందిన ఇరమైన వెంకటయ్య(70) ఈ నెల 12న తెలిసిన వారిని కలిసి వస్తానని తన భార్యకు చెప్పి ఇంటి నుంచి బయలు దేరి యాదాద్రి భువనగిరి జిల్లా రాజాపేట మండలం బసంతపురం గ్రామానికి వెళ్లాడు. అక్కడ నుంచి మరునాడు దౌలాపూర్‌కు వెళ్తున్నానని చెప్పి స్వగ్రామానికి తిరిగి రాలేదు. ఐదు రోజులు అయినా ఇంటికి రాకపోవడంతో శుక్రవారం కొడుకు మైసయ్య పోలీసులకు ఫిర్యాదు చేశాడు.

జహీరాబాద్‌లో వివాహిత..



మానెమ్మ

జహీరాబాద్ టౌన్: వివాహిత అదృశ్యమైన ఘటన జహీరాబాద్ పోలీసు స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. టౌన్ ఎస్‌ఐ వినయ్‌కుమార్ వివరాల ప్రకారం... పస్తాపూర్‌కు చెందిన బల్పటి మానెమ్మ(57) ఈ నెల 15న ఎవరికి చెప్పకుండా ఇంటినుంచి వెళ్లిపోయింది. తిరిగి ఇంటికి రాకపోవడంతో భర్త లక్ష్మయ్య పోలీసులకు ఫిర్యాదు చేశాడు.

మరో ఘటనలో బాలుడు...



వెంకటస్వామి గౌడ్

జహీరాబాద్ టౌన్: బాలుడు అదృశ్యమయ్యాడు. టౌన్ ఎస్‌ఐ. వినయ్‌కుమార్ కథనం ప్రకారం ... పట్టణంలోని మల్లగౌడ్ కుమారుడు వెంకట స్వామిగౌడ్(10) పట్టణంలోని యూపీఎస్ నం.3 పాఠశాలలో 5వ తరగతి చదువుతున్నాడు. ప్రభుత్వ హాస్టల్‌లో ఉంటూ తోటి విద్యార్థులతో ప్రతి రోజు స్కూల్‌కు వెళ్తున్నాడు. మూడు రోజుల నుంచి పట్టణంలోని బాగారెడ్డిపల్లి బంధువుల ఇంటి వద్ద నుంచి స్కూల్ వెళ్తున్నాడు. ఈ నెల 17న స్కూల్‌కు వెళ్లిన కె.వెంకటస్వామి గౌడ్ ఇంతవరకు తిరిగి రాలేదు. గతంలో రెండు సార్లు ఇలాగే వెళ్లి తిరిగి ఇంటికి వచ్చాడు. స్కూల్ హెచ్‌ఎం ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

ఇద్దరు విద్యార్థుల ఆత్మహత్యాయత్నం

హుస్నాబాద్: వెనుకబడిన తరగతుల వసతి గృహంలో ఇద్దరు విద్యార్థులు పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డారు. ఈ ఘటన శుక్రవారం హుస్నాబాద్ పట్టణంలో చోటు చేసుకుంది. వివరాలు ఇలా ఉన్నాయి. పట్టణంలోని వసతి గృహంలో దాదాపు 40 మందికి పైగా విద్యార్థులు ఉంటున్నారు. కరీంనగర్‌కు చెందిన ఓ విద్యార్థి , మరో విద్యార్థి ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాలలో ఇద్దరూ 9వ తరగతి చదువుతున్నారు. వసతి గృహంలోని తోటి విద్యార్థులు ఇంటి నుంచి తెచ్చుకున్న తినుబండారాలు దొంగతనంగా తినడంతో పాఠశాల హెచ్‌ఎంకు ఫిర్యాదు చేశారు. దీంతో హెచ్‌ఎం ఇద్దరిని పిలిచి మందలించారు. దీంతో మనస్తాపానికి గురైన ఇద్దరు విద్యార్థులు పట్టణంలోని ఓ మామిడి తోటలో పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డారు. సమాచారం తెలుసుకున్న సంక్షేమ అధికారి విద్యార్థులను ప్రభుత్వ ఆస్పత్రిలో ప్రథమ చికిత్స చేయించి, మెరుగైన వైద్యం కోసం కరీంనగర్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ప్రస్తుతం విద్యార్థులు క్షేమంగానే ఉన్నారు.

సాగులో మహిళల పాత్ర కీలకం



మహిళా రైతులకు సర్టిఫికెట్లు, మినికిట్స్ అందజేస్తున్న శాస్త్రవేత్తలు

ఎన్‌ఏఏఆర్‌ఎం ప్రిన్సిపల్ సైంటిస్ట్ డాక్టర్ ఎం.బాలకృష్ణ

కౌడిపల్లి(నర్సాపూర్): వ్యవసాయంలో మహిళల పాత్ర కీలకమని, ఆర్థికంగా మరింత అభివృద్ధి చెందే పనులు కూడా చేయాలని ఎన్‌ఏఏఆర్‌ఎం ప్రిన్సిపల్ సైంటిస్ట్ డాక్టర్ ఎం.బాలకృష్ణ తెలిపారు. శుక్రవారం మండలంలోని తునికిలోని డాక్టర్ డి.రామానాయుడు ఏకలవ్య గ్రామీణ వికాస ఫౌండేషన్ కృషి విజ్ఞాన కేంద్రం (కేవీకే)లో ఎస్సీ మహిళా రైతులకు అలవెరా సాగు, సబ్బుల తయారీ, చిరుధాన్యాల ఉత్పత్తులు, ప్రకృతి, సేంద్రియ వ్యవసాయంపై శిక్షణ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి బాలకృష్ణ హాజరై మాట్లాడుతూ.. సబ్బుల తయారీ, చిరుధాన్యాల ఆహార ఉత్పత్తులను తయారు చేసి అమ్మడం ద్వారా ఆర్థికంగా అభివృద్ధి చెందవచ్చని తెలిపారు. మహిళా రైతులకు సర్టిఫికెట్‌తోపాటు చిరుధాన్యాల మినికిట్స్ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో కేవీకే హెడ్ అండ్ సైంటిస్ట్ శంభాజీ దత్తాత్రేయ నల్కర్, ప్రోగాం ఇన్‌చార్జి గృహవిజ్ఞాన శాస్త్రవేత్త డాక్టర్ భార్గవి, శాస్త్రవేత్తలు రవికుమార్, ప్రతాప్‌రెడ్డి, శ్రీనివాస్, ఉదయ్‌కుమార్, శ్రీకాంత్ పాల్గొన్నారు.

తెగుళ్ల నివారణపై రైతులకు అవగాహన

క్షేత్రస్థాయిలో మొక్కజొన్న చేన్లకు ఏరువాక శాస్త్రవేత్తలు

సాక్షి ఎఫెక్ట్



మీర్జాపూర్‌లో రైతు చిలుకవ్వ మొక్కజొన్న చేనును పరిశీలిస్తున్న శాస్త్రవేత్త డాక్టర్ పల్లవి

హుస్నాబాద్‌రూరల్: మక్క పంటకు సోకే తెగుళ్లపై క్షేత్రస్థాయిలో అధికారులు అవగాహన కల్పిస్తున్నారు. గురువారం 'మొక్కజొన్నకు కత్తెర పురుగు' అనే శీర్షికన సాక్షిలో వచ్చిన కథనానికి వ్యవసాయ అధికారులు స్పందించారు. శుక్రవారం వ్యవసాయ తోర్నాల ఏరువాక కేంద్రం శాస్త్రవేత్తలు, అధికారులు మీర్జాపూర్‌లోని పొన్నబోయిన చిలుకవ్వ చేనును పరిశీలించారు. కత్తెర పురుగు ఉధృతిని గమనించి రైతుకు, వ్యవసాయ అధికారులకు నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా శాస్త్రవేత్త డాక్టర్.పల్లవి మాట్లాడుతూ సిద్దిపేట జిల్లాలో మొక్కజొన్న చేళ్ల మోకాలు దశకు పెరిగాయని, కత్తెర పురుగు ఉధృతి ఎక్కువగా ఉందన్నారు. ఈ పురుగు మొదటి దశ లార్వాలు పత్ర హరితాన్ని గీకి తినడం వల్ల ఆకులపై తెల్లటి పొర ఏర్పడుతుందన్నారు. రెండు, మూడవ దశలో పురుగు లార్వాలు ఆకు సుడిలో ఉండి రంధ్రాలు చేసుకు తినడం వల్ల పంటకు నష్టం జరుగుతుందని చెప్పారు.

నివారణ చర్యలు..

కత్తెర పురుగును గమనించి కోరాంట్రా నీలి ప్రోల్ లేదా ఇమామెక్టిన్ బెంజాయిట్ రసాయన మందును 0.4 మి.లీలను ఒక లీటరు నీటితో కలిపి మొక్క సుడిలో పిచికారీ చేయాలన్నారు. ఎదిగిన లార్వాల నివారణకు బెల్లం, తవుడుతో విషపు ఎరలను తయారు చేసుకొని కర్ర మొగ్గిలో వేస్తే పురుగు చస్తుందని చెప్పారు. ఒక ఎకరా చేనులో లింగాకర్షక బుట్టలను 4 నుంచి 8 వరకు ఏర్పాటు చేసుకోవాలన్నారు. వీరి వెంట వ్యవసాయ అధికారి పూజ, ఏఈఓలు విజయ్, ఐశ్వర్య ఉన్నారు.